
సీఎం సహాయనిధి చెక్కులు అందజేస్తున్న మధుయాష్కీగౌడ్

సీఎం సహాయనిధితో నిరుపేదలకు ఉపశమనం

● టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్

మన్సూరాబాద్/వనస్థలిపురం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధితో ఎంతో మంది నిరుపేదలు ఆర్థిక ఉపశమనం పొందుతున్నారని, అర్హులైన ప్రతి నిరుపేద సీఎం సహాయనిధి సద్వినియోగం చేసుకోవాలని టీపీసీసీ ప్రచారకమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ పేర్కొన్నారు. అనారోగ్యంతో ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందిన మన్సూరాబాద్‌కు చెందిన షాయిన్‌బేగంకి రూ.60వేలు, అహ్మదీబేగంకు రూ.60వేలు, ధనరకుల లక్ష్మీబాయికి రూ.60వేలు, అదేవిధంగా బీఎన్‌రెడ్డినగర్‌కు చెందిన కొత్త కావ్యకు రూ.35వేలు సీఎంఆర్ఎఫ్ ద్వారా విడుదల కాగా ఆ ఆర్థిక సాయాన్ని ఆదివారం తన నివాసంలో మధుయాష్కీ అందజేశారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


కార్పొరేటర్ నర్సింహారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న శ్రీకృష్ణనగర్‌కాలనీ సభ్యులు

శ్రీకృష్ణనగర్‌కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయండి

మన్సూరాబాద్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌పార్మర్ లేని కారణంగా ఎలక్ట్రిసిటీ శాఖాధికారులు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంలేదని, వెంటనే ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటు చేయించాలని మన్సూరాబాద్ డివిజన్ శ్రీకృష్ణనగర్‌కాలనీ సభ్యులు కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డిని కోరారు. ఈ మేరకు ఆదివారం కార్పొరేటర్ కార్యాలయంలో శ్రీకృష్ణనగర్‌కాలనీ అధ్యక్షుడు కుందేటి మురళీయాదవ్ ఆధ్వర్యంలో ఆయన్ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ మంగళవారం కాలనీలో పర్యటించి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు మునగాల హరీష్‌రెడ్డి, కాలనీ సభ్యులు బ్రహ్మయ్య, బత్తుల లింగస్వామిగౌడ్, శాగ చంద్రశేఖర్‌రెడ్డి, గోధుమగడ్డ వెంకట్‌రెడ్డి, మునగాల రాజశేఖర్‌రెడ్డి, వంటల గణేష్‌యాదవ్, సుర్వి మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


నీటి, ధాన్యం తొట్టెలు తయారు చేస్తున్న యూత్ ఫర్ సేవా సంస్థ సభ్యులు

మూగజీవుల రక్షణకు పాటుపడదాం

మన్సూరాబాద్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ప్రకృతి నేస్తాలు మూగజీవులేనని, వాటి రక్షణకు ప్రతీ ఒక్కరం పాటుపడదామని 'యూత్ ఫర్ సేవా' స్వచ్ఛంద సంస్థ పేర్కొంది. వేసవి కాలం నీటి ఎద్దడి దృష్ట్యా పక్షుల దాహార్తిని తీర్చడమే లక్ష్యంగా మన్సూరాబాద్ డివిజన్ మహవీర్ హరిణవనస్థలి జాతీయ పార్కులోని చెట్లకు ఆదివారం యూత్ ఫర్ సేవా స్వచ్ఛంద సంస్థ సభ్యులు నీటి, ధాన్యం తొట్టెలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'ప్రకృతిని రక్షించుకుందాం-పక్షులను కాపాడుకుందాం' అనే నినాదంతో అవసరమైన ప్రతీచోట తమ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో తమవంతు సహకారంగా నీటి, ధాన్యం పాత్రలను ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో భాగంగా డీర్ పార్కులో 60కి పైగా తొట్టెలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో సంస్థకు చెందిన 20మంది సభ్యులు, పార్కు నిర్వాహకులు పాల్గొన్నారు.



పిచ్చుకగూళ్లను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి, భావన శ్రీనివాస్

పిచ్చుక గూళ్లు, కుక్కల నీళ్ల తొట్టెల పంపిణీ

వనస్థలిపురం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): జాగృతి అభ్యుదయ సంఘం, లయన్స్‌క్లబ్ వనస్థలిపురం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సచివాలయనగర్‌లో కార్పొరేటర్ లచ్చిరెడ్డి ఉచిత పిచ్చుక గూళ్ల, కుక్కల నీళ్ల తొట్లను పంపిణీ చేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ మూగజీవాల పట్ల ప్రేమ, అనురాగంతో ఉచిత పిచ్చుక గూళ్ల, నీళ్ల తొట్లను పంపిణీ చేయడం అభినందనీయం అన్నారు. జీవ వైవిధ్య పరిరక్షణలో భాగంగా జాగృతి అభ్యుదయ సంఘం, లయన్స్ క్లబ్ చేపడుతున్న సామాజిక కార్యక్రమాలు ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో జాగృతి అభ్యుదయ సంఘం చైర్మన్ భావన శ్రీనివాస్, వెటర్నరీ వైద్యులు యాదగిరి, లయన్స్ క్లబ్ వనస్థలిపురం అధ్యక్షుడు విట్టా దూరయ్య, నందకిషోర్, మల్లికార్జున్, శ్రీరంగనాథ్ పాల్గొన్నారు.


వెంకటేశ్వరకాలనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీవాణిఅంజన్

సమస్యల పరిష్కారానికి చర్యలు : శ్రీవాణి

ఎల్‌బీనగర్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరకాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్ చెప్పారు. ఆదివారం వెంకటేశ్వరకాలనీ ప్రతినిధులతో ఆమె భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీవాసిని తనకు ఇక్కడి సమస్యలు తెలుసన్నారు. కాలనీలో దెబ్బతిన్న రోడ్లు బాగుచేయడానికి అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన సమస్య పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వరకాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గండు ధనంరెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, కార్యదర్శి కనకారావు, కోశాధికారి సాయికిరణ్, టి. శ్రీనివాస్‌రావు, సుధాకర్, నరేష్, కృష్ణంరాజు. బాలరాజు, వెంకట్‌రావు, శాంతిప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగ జంట ఉచిత వివాహ మహోత్సవం

సైదాబాద్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): రూపాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సైదాబాద్ ఎస్‌బీహెచ్‌కాలనీలోని శ్రీ శ్రీనివాసా కమ్యూనిటీ హాల్‌లో దివ్యాంగ జంటకు ఉచితంగా వివాహ వేడుకలు జరిపించారు. లావణ్య, హరినాథ్ జంటకు సంప్రదాయబద్ధంగా వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలు జగిని ఫర్నిచర్ సహకారంతో జరిగాయి. కార్యక్రమంలో రూపాయి ఫౌండేషన్ చైర్మన్ నాగమల్ల అనిల్‌కుమార్, జగిని ఫర్నిచర్ ప్రాజెక్టు చైర్మన్ జగిని శ్రీనివాస్, యడవల్లి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

మీర్‌పేట్‌లో ఇంటి పన్నుల వ్యవహారం..

ఏకమైన రాజకీయ పార్టీలు !

● ఆల్ పార్టీ మీటింగ్ ఏర్పాటు

● ముఖం చాటేసిన బీజేపీ

● ప్రభుత్వం స్పందించకుంటే కోర్టులో పిటిషన్ : ఫెడరేషన్ వెల్లడి


ఆల్ పార్టీ మీటింగ్‌లో పాల్గొన్న నాయకులు, ఫెడరేషన్ ప్రతినిధులు

సరూర్‌నగర్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లో ఇంటి పన్నుల అంశంపై పోరాటం చేసి క్రెడిట్‌ను ఖాతాలో వేసుకోవాలని ఉబలాటపడిన రాజకీయ పార్టీలకు బ్రేక్ పడింది.. ప్రధానమైన ప్రజా సమస్యపై ఉమ్మడిగా పోరాటం చేయాల్సిందిపోయి ప్రధాన పార్టీలు ఎవరికి వారు సొంత ఇమేజ్ పెంచుకోవడానికిగాను వేర్వేరుగా కార్యక్రమాలు చేస్తుండడంతో ఇదే అంశంపై గత గురువారం 'రాజకీయ పార్టీల్లో క్రెడిట్ గేమ్' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో వార్తా కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. వాస్తవానికి ఈ అంశంపై ఓ ఫెడరేషన్ ఏర్పాటై పలు కార్యక్రమాలు చేస్తుండగా ఇతర పార్టీలు సైతం కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాయి. కాగా 'ఆంధ్రజ్యోతి' కథనంతో స్పందించిన ఫెడరేషన్ ప్రతినిధులు.. తమకు రాజకీయాలకన్నా ప్రజా సమస్య పరిష్కారమే ముఖ్యమని భావించి, ఈ అంశంలో అన్ని పార్టీలను కలుపుకుని పోవాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలో ఆదివారం జిల్లెలగూడలోని ఓల్డ్‌గాయత్రీనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఆల్ పార్టీ మీటింగ్ ఏర్పాటు చేసింది. ఈ మేరకు ఫెడరేషన్ ప్రతినిధులు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, బీఎస్పీ, సీపీఐ, సీపీఎం మీర్‌పేట్ కమిటీల అధ్యక్షులకు శనివారం ఆహ్వానం అందజేశారు.

బీజేపీ డుమ్మా..

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆదివారం ఉదయం 9గంటలకు ఏర్పాటు చేసిన ఆల్ పార్టీ మీటింగ్‌కు బీజేపీ క్లస్టర్-1,2 అధ్యక్షులు భిక్షపతిచారి, ముఖేశ్‌కుమార్ మినహా ఇతర పార్టీల ప్రతినిధులందరూ హాజరు కావడం గమనార్హం! ఫెడరేషన్ అధ్యక్షుడు ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి వంటేరు నర్సింహారెడ్డిల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి కాంగ్రెస్ అధ్యక్షుడు సామిడి గోపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేశ్‌గౌడ్, సీపీఐ కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, దశరథ, సీపీఎం కార్యదర్శి యాదయ్య, ప్రకాశ్‌రెడ్డి, బీఎస్పీ ఇన్‌చార్జి ఇందుమతి తదితరులు హాజరయ్యారు. వ్యక్తిగత కారణాల వల్ల తాము హాజరుకాలేదని బీజేపీ నాయకులు చెబుతున్నప్పటికీ.. తమకు సమాచారం ఆలస్యంగా ఇచ్చారని అలకవహించి గైర్హాజరయినట్టు తెలిసింది. అయితే తాము అన్ని పార్టీల అధ్యక్షులకు ఒకేసారి సమాచారం ఇచ్చామని, ఇందులో తాము రాజకీయం చేయదలచుకోలేదని ఫెడరేషన్ ప్రతినిధులు స్పష్టం చేశారు.

ఫెడరేషన్‌తో కలిసి నడుస్తాం.. పార్టీపరంగా కూడా ఉద్యమిస్తాం..

ఆదివారంనాటి అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న ఆయా పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ ఇంటి పన్నుల భారం తగ్గించడానికి ఫెడరేషన్ ఏ కార్యక్రమం చేపట్టినా తాము కలిసి వస్తామని, అదే సమయంలో తమ పార్టీల పరంగా కూడా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి వేర్వేరుగా సైతం ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. ధర్నాలు, ఆందోళనల ద్వారా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని వారు పేర్కొన్నారు. కాగా తమ పార్టీ అధికారంలో ఉన్నందున అవసరమైతే సీఎం దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. నేరుగా సీఎంను కలవడం కన్నా ప్రోటోకాల్ ప్రకారం నియోజకవర్గం ఇన్‌చార్జి కేఎల్లార్‌ను కలిసి వినతిపత్రం అందజేద్దామని ఆయన చెప్పగా.. కేఎల్లార్ ప్రజా ప్రతినిధి కాదు కాబట్టి తాము ఆయనను కలవడానికి రాబోమని, మంత్రులను కలవడానికైతే వస్తామని ఇతర పార్టీల ప్రతినిధులు స్పష్టం చేశారు. అయితే ఫెడరేషన్ ప్రతినిధులు మాత్రం ఆయన వెంట వెళ్లడానికి ఓకే చెప్పడంతో వెంటనే అక్కడి నుంచి తుక్కుగూడలోని కేఎల్లార్ కార్యాలయానికి వెళ్లి ఆయనకు వినతిపత్రం అందజేశారు. తాను ఈ సమస్యను జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్తానని, సీఎంతోనూ చర్చిస్తామని ఆయన పేర్కొన్నారు.

అవసరమైతే కోర్టును ఆశ్రయిస్తాం

మీర్‌పేట్‌లో ఇంటి పన్నుల సమస్యను ప్రభుత్వం పరిష్కరించకపోతే ఫెడరేషన్ ఆధ్వర్యంలో కోర్టులో పిటిషన్ వేసి న్యాయ పోరాటం చేస్తామని ప్రతినిధులు పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ, బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లలో ఉన్నట్టుగా తమ కార్పొరేషన్‌లోనూ ఇంటి అద్దె(రెంటల్ వాల్యూ) ఆధారంగా పన్నులు నిర్ణయించాలని వారు డిమాండ్ చేశారు. సామాన్యులకు భారంగా మారిన ఇంటి పన్నులను తక్షణమే తగ్గించాలని వారు కోరారు. సమావేశంలో ఫెడరేషన్ ప్రతినిధులు మల్లారెడ్డి, వెంకటయ్య, ప్రేమ్‌చందర్‌రెడ్డి, శాంతమూర్తి, దేశాయ్‌రెడ్డి, కేశవరావు, శ్రావణ్, కిరణ్, సుధాకేశవ్ తదితరులు పాల్గొన్నారు.

118 జీవో విషయంలో ఆందోళన అవసరం లేదు

● ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి


జైహింద్‌పార్కులో కాలనీల ప్రజలతో సమావేశమై మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హయత్‌నగర్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో పేదలకు న్యాయం చేయడానికి తీసుకువచ్చిన జీవో 118 విషయంలో ఎలాంటి ఆందోళనపడాల్సిన అవసరం లేదు. కావాలని కొందరు కాంగ్రెస్ నాయకులు కన్వీయన్సీ డీడ్‌లు రాకుండా అడ్డుపడుతున్నారని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం ఆయన హయత్‌నగర్ డివిజన్‌లోని కమర్షియల్ ట్యాక్సు కాలనీలో నూతనంగా నిర్మించిన జైహింద్ పార్కును సందర్శించారు. అనంతరం సమీపంలోని కాలనీల ప్రజలతో సమావేశమై అక్కడ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వచ్చారని తెలుసుకున్న బ్లడ్‌బ్యాంకుకాలనీ, ఖాదిబోర్డుకాలనీ, సీటీఓకాలనీ, వాసవికాలనీ, ప్రగతినగర్‌కాలనీతో పాటు పలు కాలనీలవాసులు అక్కడికి చేరుకుని తమ సమస్యలను ఎమ్మెల్యేకు ఏకరువు పెట్టారు. ఔట్‌లెట్ లేకపోవడంతో మురుగు నీరు మొత్తం మా కాలనీలను ముంచెత్తుతుందన్నారు. రోడ్లు, ఖాళీ స్థలాలు మురుగునీటితో నిండి పరిసరాలు కలుషితం అయ్యాయని తెలిపారు. రోడ్లు, వీధిలైట్లు లేక నానా ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఎన్‌రెడ్డినగర్‌లోని థీమ్ పార్కును తాను రెండు రోజుల క్రితం సందర్శించి 118 జీవో విషయమై ముఖ్యమంత్రితో చర్చిస్తానని బాధితులకు చెప్పడం జరిగిందని గుర్తుచేశారు. ఇది జీర్ణించుకోలేని కాంగ్రెస్ నాయకుడు మధుయాష్కిగౌడ్ శనివారం థీమ్ పార్కును సందర్శించి 118 బాధితులను తాను ముఖ్యమంత్రి దగ్గరకు తీసుకువెళ్తానని చెప్పడం హస్యాస్పదంగా ఉందన్నారు. బాధిత ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ నాయకులే కన్వీయన్సీ డీడ్‌లు రాకుండా అడ్డుకున్నారని సుధీర్‌రెడ్డి ఆరోపించారు. బాధితులకు కన్వీయన్సీ డీడ్‌లు రాకుంటే అందుకు కాంగ్రెస్ పార్టీనే బాధ్యత వహించాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్‌రెడ్డి, నాయకులు శ్రీధర్‌గౌడ్, గుడాల మల్లేష్, భాస్కర్‌సాగర్, మల్లీశ్వరీరెడ్డి, యానాల కృష్ణారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, స్కైలాబ్, మనోజ్, కాలనీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నర్సింహారెడ్డి, గణేష్‌రెడ్డి, రవి పాల్గొన్నారు.

రక్తదానం చేయండి.. ప్రాణదాతలు కండి

వనస్థలిపురం : ప్రతి ఒక్కరూ నిర్భయంగా రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం వనస్థలిపురం రైతుబజార్ వెనుకాల బాంబే ట్రీ పార్క్‌లో మదర్ థెరిస్సా చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తాన్ని ప్రయోగశాలలో తయారు చేయలేం కాబట్టి ఆపద సమయంలో రోగుల విలువైన ప్రాణాలను కాపాడడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా రక్తం దానం చేయాలన్నారు. కార్య క్రమంలో వనస్థలిపురం మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, మదర్ థెరిస్సా చారిటబుల్ సొసైటీ అధ్యక్షుడు చేపూరి శంకర్, నాయకులు లగ్గోని శ్రీధర్‌గౌడ్, శివశంకర్, సునీత, సుజాత, యోగిత, యోగా శ్రీనివాస్, శూలపాణి పాల్గొన్నారు.

బహుమతుల అందజేత

అబ్దుల్లాపూర్‌మెట్ : కవాడిపల్లి ప్రీమియర్ లీగ్(కేపీఎల్) సీజన్-9 క్రికెట్ టోర్నీ ఫైనల్ మ్యాచ్‌లో జై శ్రీరామ్ జట్టు విజేతగా నిలిచింది. డీవైజీ టీం రన్నరప్‌తో సరిపెట్టుకుంది. జనవరి 26న గ్రామంలో కేపీఎల్ క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. కాగా ఆదివారం ఫైనల్స్ పోటీలను నిర్వహించారు. ఈ ఫైనల్స్‌లో మాజీ సర్పంచ్ ఇరుగు చిత్తారికి చెందిన జై శ్రీరామ్ టీం, డీవైజీ టీంతో తలపడింది. హోరాహోరీగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో జై శ్రీరామ్ జట్టు విజయం సాధించగా, డీవైజీ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా విన్నర్, రన్నర్ జట్లకు నగదు బహుమతితో పాటు షీల్డ్‌లను అందజేశారు. మాజీ సర్పంచ్ దూసరి సుజాతాయాదయ్యగౌడ్, టీం స్పాన్సర్స్ బొడిగె కొండల్‌గౌడ్, జాపాల కిట్టుయాదవ్, బొడిగె రమేష్‌గౌడ్, నిర్వాహకులు సాయిరెడ్డి, రాము, విక్కి, రవి, సురేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ దాసోజును కలిసిన మనుమయ సంఘం నేతలు

చంపాపేట : బీఆర్ఎస్ నుంచి ఇటీవల నూతనంగా ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన విశ్వకర్మ, స్వర్ణకారుల ముద్దుబిడ్డ దాసోజు శ్రవణ్‌కుమార్‌ను ఆదివారం తెలంగాణ విశ్వకర్మ మనుమయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుంకోజు కృష్ణమాచారి ఆధ్వర్యంలో పలువురు నేతలు ఎమ్మెల్సీని మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటికొండ శ్రీరాములు, కోశాధికారి గంధల శ్రీనివాస్‌చారి, యూత్ రాష్ట్ర అధ్యక్షుడు పరిపూర్ణాచారి, రాష్ట్ర కార్యదర్శి బ్రహ్మాచారి, గ్రేటర్ అధ్యక్షుడు అశోక్‌చారి, నేతలు లక్ష్మీనారాయణ, వడ్ల బ్రహ్మాచారి, మహేష్‌చారి, యుగేందర్‌చారి, మల్లేష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం


కేటీఆర్, జగదీశ్‌రెడ్డిల దిష్టిబొమ్మలు దహనం చేస్తున్న పారిజాతారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి

సరూర్‌నగర్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం కాంగ్రెస్ నాయకులు మీర్‌పేట్ చౌరస్తాలో జగదీశ్‌రెడ్డితో పాటు కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో టఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్‌లోని ప్రజా ప్రతినిధులకు రాజ్యాంగంపై, గవర్నర్‌పై ఏమాత్రం గౌరవం లేదని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో వెంకటేశ్, గంగమ్మ, పద్మ, వెంకటేశ్‌గౌడ్, పాండుగౌడ్, భాస్కర్, శ్రీశైలం, బాలమణి, అరుణాప్రభాకర్‌రెడ్డి, సుగుణ, పరశురామ్ పాల్గొన్నారు.

బడంగ్‌పేట్‌లో..

గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం బడంగ్‌పేట్ చౌరస్తాలో జగదీశ్‌రెడ్డి, కేటీఆర్‌ల దిష్టిబొమ్మలను దహనం చేశారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి పాల్గొని మాట్లాడుతూ జగదీశ్‌రెడ్డి స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి అమరేందర్‌రెడ్డి, వంగేటి ప్రభాకర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, మనోహర్, సంతోషీశ్రీనివాస్‌రెడ్డి, మహేశ్వరీజైహింద్‌కుమార్, అమృతానాయుడు పాల్గొన్నారు.

హయత్‌నగర్ : కాంగ్రెస్ తుర్కయంజాల్ మున్సిపాలిటీ అధ్యక్షురాలు కొత్తకుర్మ మంగమ్మ ఆధ్వర్యంలో తుర్కయంజాల్ చౌరస్తాలో ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. మంగమ్మ మాట్లాడుతూ జగదీశ్‌రెడ్డి బేషరతుగా స్పీకర్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి కొత్తకుర్మ శివకుమార్, కుంట గోపాల్‌రెడ్డి, యశ్వంత్, అర్జున్, తిరుమలేష్ పాల్గొన్నారు.

మన్సూరాబాద్ : స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి శాసన సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని తెలంగాణ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి డిమాండ్ చేశారు. ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహనీయుల విగ్రహాల వద్ద జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి, బానోతు సుజాతానాయక్, డివిజన్ పార్టీ అధ్యక్షుడు కుట్ల నర్సింహయాదవ్, శశిధర్‌రెడ్డి, వేణుగోపాల్‌యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.


ప్రశాంత్‌నగర్‌లో ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

ఓపెన్ జిమ్ ప్రారంభం

వనస్థలిపురం : ఆరోగ్య పరిరక్షణకు ఓపెన్ జిమ్ లు ఎంతగానో ఉపయోగపడతాయని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నా రు. వనస్థలిపురం డివిజన్ ప్రశాంత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను కార్పొరేటర్ ఆదివారం ప్రారంభించారు. కార్పొరేటర్ మాటాడుతూ కాలనీవాసులు ప్రతిరోజు వ్యాయామం చేస్తూ తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీవాసులు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.


జనప్రియ అవెన్యూ వాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

ఆరోగ్య పరిరక్షణకు ఔట్‌డోర్ జిమ్స్ ఏర్పాటు

కొత్తపేట : కొత్తపేట డివిజన్ పరిధిలో కాలనీల ప్రజల ఆరోగ్య పరిరక్షణకు రూ.47లక్షలతో ఔట్‌డోర్ జిమ్స్ ఏర్పాటు చేస్తున్నామని కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. సత్యానగర్ జనప్రియ అవెన్యూ అపార్టుమెంట్ల సముదాయం ఆవరణలో ఏర్పాటు చేసిన వివిధ రకాల వ్యాయామ పరికరాల వినియోగాన్ని ఆదివారం ఆయన అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔట్‌డోర్ జిమ్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అపార్టుమెంట్ల సముదాయం అధ్యక్షుడు స్వామి, కార్యదర్శి కృష్ణకిషోర్, ప్రతినిధులు శ్రీనివాస్, భానుప్రసాద్, రామ్మోహన్‌రెడ్డి, పృథ్వీ, నాయకులు మంచి రాజేష్, వెంకట్‌రెడ్డి, తోట మహేందర్‌యాదవ్ పాల్గొన్నారు.


గోదాంలో నిల్వ చేసిన రేషన్ బియ్యం

30 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

హయత్‌నగర్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వ చేసిన 30 టన్నుల రేషన్ బియ్యాన్ని లారీలో తరలించడానికి లోడ్ చేస్తుండగా హయత్‌నగర్ పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దఅంబర్‌పేట్ నుంచి మునగనూరు గ్రామానికి వెళ్లె మార్గంలో ఓ గోదాంలో అక్రమంగా సుమారు 30 టన్నుల రేషన్ బియ్యాన్ని నిల్వ చేశారు. ఆదివారం సాయంత్రం బియ్యాన్ని లారీలో తరలించడానికి లోడ్ చేస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు హయత్‌నగర్ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ముందుగా మొబైల్ పోలీసులు, ఆ తరువాత ఎస్ఐ వెంకట్‌రెడ్డిలు అక్కడికి చేరుకుని బియ్యం తరలింపును అడ్డుకున్నారు. వెంటనే డ్రైవర్ శివకుమార్‌రెడ్డి(22)ను, రేషన్ బియ్యాన్ని సేకరించి అక్కడ నిల్వ చేసిన హయత్‌నగర్ బంజారాకాలనీకి చెందిన కరంటోతూ తిరుపతి (37)ని అదుపులోకి తీసుకున్నారు. లారీని సీజ్ చేశారు. లారీలో ఎక్కించిన బియ్యం కాకుండా గోదాంలో మరో 7 టన్నుల బియ్యం ఉన్నాయని సీఐ నాగరాజుగౌడ్ తెలిపారు. గోదాంకు తాళం వేసి సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. నిందితులను రిమాండుకు తరలించినట్లు ఆయన తెలిపారు.

నిందితులను పట్టించిన ఫోన్‌పే ట్రాన్సాక్షన్

● సూత్రధారి ఆలయ అర్చకుడే

● అకౌంటెంట్‌పై యాసిడ్‌దాడి కేసులో గురుశిష్యుల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సౌత్ ఈస్ట్ డీసీపీ కాంతిలాల్ పాటిల్ సుభాష్

సైదాబాద్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): సైదాబాద్ భూలక్ష్మి ఆలయ అకౌంటెంట్ నర్సింగరావుపై శుక్రవారం రాత్రి జరిగిన యాసిడ్ దాడి కేసులో గురుశిష్యులను సైదాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఘటనకు ప్రధాన సూత్రదారి ఆలయ అర్చకుడు కాగా పాత్రదారి మరో అర్చకుడిగా పోలీసులు నిర్ధారించారు. ఆదివారం సైదాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ కాంతిలాల్ పాటిల్ సుభాష్ వివరాలు వెల్లడించారు. ఈనెల 14న భూలక్ష్మి ఆలయంలో అకౌంటెంట్ నర్సింగ్‌రావు కూర్చొని ఉండగా ముసుగు ధరించిన గుర్తు తెలియని వ్యక్తి వచ్చి తాను నరేష్‌గా పరిచయం చేసుకుని అన్నదానం చందా గూర్చి అడుగుతూ ఆకస్మాతుగా హ్యాపీ హోలీ అంటూ యాసిడ్ పోసి పారిపోయాడు. దీంతో తీవ్రంగా గాయపడిన నర్సింగ్‌రావును చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదుతో సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులను పట్టుకునేందుకు ఆరు పోలీస్ బృందాలు ఏర్పాటు చేసిన 400 సీసీ టీవీ ఫుటేజీలు పరిశీలించారు. ఈ క్రమంలో దాడి చేసేందుకు వచ్చే నాంపల్లి గాంధీభవన్ మెట్రోస్టేషన్ వద్ద నిందితుడు క్యాప్ కొని ఫోన్ పే ద్వారా ట్రాన్సాక్షన్ చేసినట్లు గుర్తించారు. వ్యాపారి వద్ద ఫోన్ నంబరు సేకరించి నిందితుడు హరిపుత్రను షేక్‌పేటలోని ఆయన నివాసంలో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. రాజశేఖర్‌శర్మ ఆదేశాల మేరకే యాసిడ్ దాడి చేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతో గురుశిష్యులను పోలీసులు అరెస్ట్ చేశారు.

గురువు ఆదేశించాడు.. శిష్యుడు అమలు చేశాడు

సైదాబాద్ సరస్వతీనగర్ కాలనీలో నివాసముండే హరిపిరాల రాజశేఖర్‌శర్మ(41) భూలక్ష్మి ఆలయంలో ప్రధాన అర్చకుడిగా పనిచేస్తున్నారు. గతంలో మెదక్ జిల్లా సదాశివపేటకు చెందిన రాయికోడ్ హరిపుత్ర(31) రాజశేఖర్‌శర్మ వద్ద పనిచేసి వేదపారాయణం నేర్చుకున్నారు. దీంతో వీరి మధ్య గురుశిష్యుల బంధం ఉంది. కొంత కాలంగా ఆలయ అకౌంటెంట్ నర్సింగరావు, రాజశేఖర్‌శర్మల మధ్య అంతర్గత విభేదాలు ఉన్నవి. దీంతో అకౌంటెంట్‌పై యాసిడ్ దాడి చేసి ఇంటికే పరిమితం చేయాలని భావించారు. ఈ క్రమంలో యాసిడ్ దాడి చేయడానికి హరిపుత్రతో రాజశేఖర్‌శర్మ రూ.2 వేలకు ఒప్పందం కుదుర్చుకుని ముందుగా వేయి రూపాయలు ఆన్‌లైన్ పంపాడు. ఘటన జరిగిన సమయానికి పలుమార్లు ఫోన్‌లు చేసుకున్నారు. ముందుగా యాసిడ్ డబ్బాను రాజశేఖర్‌శర్మ తీసుకువచ్చి ఆలయంలో బయట ఉంచాడు. ఈ మేరకు హరిపుత్ర మొఖానికి ముసుగు, క్యాప్ ధరించి వచ్చి దాడి చేసి పారిపోయాడు.

కస్టడీకి తీసుకుంటాం..

రసీదులు ఇవ్వకుండా ఆలయ సొమ్ము కాజేస్తున్నాడని, గుడికి వచ్చే చిన్నపిల్లలను దూషిస్తున్నాడని, దాడికి వివిధ కారణాలను రాజశేఖర్‌శర్మ చెబుతున్నాడని డీసీపీ తెలిపారు. నిందితులను కోర్టు అనుమతితో మరోసారి కస్టడీలోకి తీసుకుని విచారించనున్నట్లు వివరించారు. నిందితుడు హరిపుత్ర వద్ద మొబైల్‌ఫోన్, మోటర్ సైకిల్, రాజశేఖర్‌శర్మ వద్ద రెండు ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అంతేగాకుండా దాడికి ఉపయోగించిన యాసిడ్‌ను ల్యాబ్‌కు పంపించి గుర్తించనున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సౌత్ ఈస్ట్ అడిషనల్ డీసీపీ స్వామి, టాస్క్‌ఫోర్స్ అడిషనల్ డీసీపీ శ్రీనివాస్‌రావు, ఏసీపీ వెంకన్ననాయక్, సైదాబాద్, మాదన్నపేట ఇన్‌స్పెక్టర్లు రాఘవేందర్, శ్రీనివాస్, డీఐ ఆనంద్‌కుమార్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోలుకుంటున్న బాధితుడు

యాసిడ్ దాడిలో గాయపడిన బాధితుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని డీసీపీ తెలిపారు. ఎలాంటి ప్రాణాపాయం లేదని డాక్టర్లు వెల్లడించారన్నారు. దాడి తీవ్రత వల్ల కొన్ని రోజులు ఆస్పత్రిలో ఉండాల్సిన అవసరముందని చెప్పారు.